# పారిశ్రామిక రంగానికి తొలి అడుగులు

*-స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ సదస్సులో మంత్రి సుభాష్*



రామచంద్రపురం, నేటి పత్రిక ప్రజావార్త : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యసాధన దిశగా కృషి చేసి ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక వి ఎస్ ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగింది. తొలుత ఈ సమావేశాన్ని మంత్రి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావులు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా రామచంద్రపురం నియోజవర్గంలో చేపట్టిన సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించడం ద్వారా నిరుద్యోగం నిర్మూలించి, వారిలో ఆత్మ స్థైర్యం నింపేందుకు తొలిమెట్టు పడిందని అన్నారు. స్వర్ణాంధ్ర సృష్టికర్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్-2047 లక్ష్యంగా రాష్ట్రంలో నే మొదటి సారిగా ఈ అవగాహన సమావేశం రామచంద్రపురం నుంచి మొదలు పెట్టడం జరిగింది అన్నారు. కోనసీమ పరిశ్రమలు స్థాపించడానికి అనువైన ప్రాంతం అని, వ్యవసాయ ఆధారిత, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎంఎస్ఎంఇల స్థాపనకు అనుకూలంగా ఉన్న ప్రాంతమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం మేరకు యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేయడమే మా లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇల ద్వారా సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, బ్యాంకుల ద్వారా రెండు సదుపాయం అందించి ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. తనకు రాజకీయాలు కొత్త ఏమో కానీ, సేవా తత్వానికి, మానవత్వానికి మాత్రం పాతవాడినేనని, గత 15 సంవత్సరాలుగా సేవలందిస్తున్నామన్నారు. నన్ను నమ్మి గెలిపించిన రామచంద్రపురం ప్రజల కోసం అహర్నిశలు శ్రమించి వారి బాగు కోసం, వారు అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తానని హామీ ఇచ్చారు. రామచంద్రపురంలో ఉద్దండ నాయకులున్న కాదని నన్ను గెలిపించిన రామచంద్రపురం ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలుగా సహకరించి, బ్యాంకు లోన్లు కూడా వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే పెట్టుబడిదారులను కూడా తీసుకొస్తాం...సంకల్పంతో రండి మీ బాధ్యత మేము తీసుకుంటాం... పరిశ్రమలు పెట్టిద్దాం అని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ కోనసీమను అభివృద్ధి చేసేందుకు మంత్రి సుభాష్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇంటికి ఒక పారిశ్రామిక వేత్త ను తయారు చేసే ప్రక్రియలో తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానన్నారు. ఎంఎస్ఎంఇ అవగాహన కోసం రాష్ట్రంలో తొలిసారిగా రామచంద్రపురంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం ఆనందకరమన్నారు. తన జిల్లా ప్రజలకు మేలు చేయాలని మంత్రి సుభాష్ ఆరాటపడుతుంటారని అన్నారు. గతంలో ఉన్న ఈజీ ఆఫ్ డూయింగ్ ని కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ గా మార్చి వేగవంతంగా సేవలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. కోనసీమ జిల్లాలో యువత ఉత్సాహంతో ఉన్నారని వారికి సేవలందిస్తే ముందుకు దూసుకుపోతారన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనారాయణరావు మాట్లాడుతూ జిల్లాకే తలమానికంగా నిరుద్యోగులైన యువతి,యువకుల కోసం స్కిల్ డెవలప్మెంట్, పారిశ్రామికరణ విధానం, ప్రభుత్వం అందించే స్కీములు, కోసం అవగాహన కల్పించడం పట్ల మంత్రి సుభాష్ చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ సమావేశంలో వైద్యులు ఆశ్లేష, కూటమి సీనియర్ నాయకులు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, ఆర్డిఓ అఖిల, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రసాద్, వికాసా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్షణరావు, తహసిల్దార్ ఎం సావిత్రి, ప్రముఖ వైద్యురాలు ఆశ్లేష, కూటమి నాయకులు, పెద్ద ఎత్తున యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహించాలి...

*మంత్రి కొల్లు రవీంద్ర*



మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త : పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల విద్యార్థులను ప్రోత్సహిస్తే గొప్పగా రాణించి అద్భుతాలను సృష్టిస్తారని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల అండర్ 19 బాలురుల క్రికెట్ టోర్నమెంట్ ను ఆదివారం సాయంత్రం నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే ఈ టోర్నమెంట్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి దాదాపుగా 16 టీములు పాల్గొంటున్నాయని, ఆయా టీములు దాదాపుగా 26 మ్యాచులు ఆడతాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ కు మచిలీపట్నం ప్రధాన వేదిక కావటం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పెద్ద ఎత్తున పాఠశాల క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు క్రీడలకు సంబంధించిన కిట్లను అందించడం జరిగిందన్నారు. సీఎం కప్ తరహా ఆటల పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించామన్నారు. అయితే గత ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తిరిగి గత పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతోపాటు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అన్ని ప్రాంతాలలో క్రీడామైదానాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలి పారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కేలో ఇండియా కార్యక్రమం కింద మచిలీపట్నంలో 13.5 ఎకరాల భూమిని గుర్తించి రూ.8కోట్లతో అథ్లెటిక్ ట్రాక్, అదేవిధంగా రూ.5 కోట్ల నిధులతో ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణం కోసం టెండర్లు ప్రక్రియ మొత్తం పూర్తి చేసి పనులను ప్రారంభించామని, అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం దానిని పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం అదే స్థలంలో తిరిగి స్టేడియం నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టామని, జిల్లా కలెక్టర్ నుంచి అందుకు సంబంధించిన తీర్మానం సైతం పొందినట్లు మంత్రి తెలిపారు. దాని ఆధారంగా డిపిఆర్ సిద్ధం చేసి దాదాపు రూ.18 కోట్ల నిధుల వ్యయంతో స్టేడియం నిర్మాణంతోపాటు క్రీడాకారుల వసతి గృహాలను నిర్మించేందుకు రూపకల్పన చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదెకరాల స్థలంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నిని కోరడం జరిగిందని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన స్థలాన్ని సైతం గుర్తించామని త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ కోర్టులు నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, గ్రీన్ స్టోన్ సిఎండి అప్పికట్ల అప్పారావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, కూటమి నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని అడ్డుకునే ప్రయత్నం: ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదు!


అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు (ఏడీబీ) కలిసి రూ. 15 వేల కోట్ల రుణం ఇస్తుండటంతో గుర్తు తెలియని వ్యక్తులు మళ్లీ తెరమీదికి వచ్చారు. ఈ నెల 18న ప్రపంచబ్యాంకు ఇన్స్పెక్షన్ ప్యానెల్కు లేఖ రాస్తూ.. రాజధాని నిర్మాణానికి భూసమీకరణ చేయడం చట్టవిరుద్ధమని, రైతుల్ని బెదిరించి, భయపెట్టి సంతకాలు చేయించుకున్నారని అందులో ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా అక్కడి ప్రజలు జీవనభృతిని కోల్పోయారని, ఆహార భద్రతకు విఘాతం కలుగుతోందని అసత్య ఆరోపణలు చేశారు. పర్యావరణ, సామాజిక, ఆర్థిక అసమానతలు కూడా తలెత్తుతాయని పేర్కొన్నారు. రైతులతో అర్థవతమైన చర్చలు జరగలేదని, ఆ సమాచారాన్ని కూడా గోప్యంగా ఉంచారని ఆరోపించారు. అంతేకాదు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నిర్మాణ కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. చంద్రబాబునాయుడు హయాంలో 2014-19 మధ్య కూడా అమరావతి విషయంలో ఇలానే లేఖలు రాసి నిధులు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ప్రపంచబ్యాంకు ఇన్స్పెక్షన్ ప్యానెల్ ను నియమించి ఫిర్యాదులోని ఆరోపణలు నిజం కాదని నిగ్గు తేల్చింది. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం ప్రపంచబ్యాంకు రుణాన్ని తిరస్కరించింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతుండడంతో నాటి శక్తులు మళ్లీ నేడు జూలు విదిల్చినట్టుగా కనిపిస్తోంది. అందులో భాగంగానే ఈ ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు.

# తెనాలిలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం: మంత్రి నాదెండ్ల



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : క్రీడలను ప్రోత్సహిస్తూ తెనాలిలో సువిశాలమైన స్టేడియంను నిర్మించనున్నామని ఏపీ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. 1.76 ఎకరాల మున్సిపల్ భూమిని సేకరించి రూ. 3 కోట్ల అంచనాతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అందులోనే వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులతో పాటు స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పట్టణ అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక సిద్ధం చేయబోతున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ, మెరుగైన వైద్య సదుపాయాలు, రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా, తెనాలి కళాకారుల సంస్కృతి తదితర అంశాలను ప్రాథమికంగా తీసుకుని తెనాలి పట్టణాన్ని అభివృద్ధి నిర్మాణంలో నడిపిస్తామని నాదెండ్ల వివరించారు. తెనాలి పట్టణ పరిధిలో రోడ్ల విస్తరణతో పాటు నిఘా కెమెరాలు ఏర్పాటుపై పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో భాగంగా తెనాలి-కొల్లిపర సీసీ రోడ్లు అభివృద్ధి చేయబోతున్నామన్నారు. రూ 20 లక్షలతో చినారావూరు పార్క్ ను మరమ్మత్తులు చేపట్టి డిసెంబర్ 30 నాటికి సుందరీకరణ చేయబోతున్నామని, రూ 1.15 కోట్లతో తెనాలి ఐతానగర్లో ఐకర్స్ పార్క్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. సంక్రాంతి పండగలోపు దుగ్గిరాల, మంగళగిరి రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేస్తామని చెప్పారు.

# జైసల్మేర్ లో జరిగిన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్



రాజస్థాన్, నేటి పత్రిక ప్రజావార్త : జైసల్మేర్ లో జరిగిన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఏపీకి సంబంధించిన వివిధ అంశాలపై జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. కీలక రంగాలకు సంబంధించి జీఎస్టీ విధానంలో తేవాల్సిన మార్పు చేర్పులపై జీఎస్టీ కౌన్సిల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కీలక సూచనలు చేశారు. కీలకాంశాలపై ఏపీ సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చొరవను జీఎస్టీ కౌన్సిల్లో ప్రత్యేకంగా పయ్యావుల ప్రస్తావించారు. ఏపీలో ప్రభుత్వం మారాక జాతీయ స్థాయిలో పాజిటివ్ టాక్ వినిపిస్తోందని పయ్యావులకు వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు చెప్పారు. కేశవ్ ఇచ్చిన కీ-నోట్ ప్రసంగానికి ఇతర రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రుల నుంచి ప్రశంసలు. రాష్ట్రానికి ఏం కావాలో ప్రజెంట్ చేస్తూనే.. వివిధ రంగాల్లో జీఎస్టీ కౌన్సిల్ అనుసరించాల్సిన విధానాలను చక్కగా చెప్పారన్న వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు. పయ్యావుల కేశవ్ సహా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సూచనలను పరిశీలించేందుకు మంత్రివర్గ ఉప సంఘం వేసిన జీఎస్టీ కౌన్సిల్. తాను చేసిన సూచనలపై వెంటనే మంత్రి వర్గ ఉప సంఘం వేసినందుకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు ధన్యవాదాలు ఆర్థిక మంత్రి పయ్యావుల తెలిపారు. పయ్యావుల కేశవ్ వెంట జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు వెళ్లారు.

**పయ్యావుల కేశవ్, ఏపీ ఆర్థిక మంత్రి...** 5 శాతానికి మించి జీఎస్టీ శ్లాబులో ఉన్న వస్తువులపై రాష్ట్రంలో జరిగే రవాణపై ఒక్క శాతం ఏపీ ఫ్లడ్ సెస్ విధించాలి. దీని వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉండదు. ఈ సెస్ ద్వారా ఏపీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపడతాం. 2018లో కేరళ వరదల సమయంలో ఇదే తరహా సెస్ విధించారు. ఇన్నోవేషన్లకు ప్రోత్సహమిచ్చేలా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహించే రీసెర్చ్ సర్వీసెస్ కు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలి. పేదలకు రేషన్ ద్వారా ఇచ్చే పోర్టిఫైడ్ బియ్యంపై జీఎస్టీ సుంకాన్ని తగ్గించాలి. ఐజీఎస్టీ సెటిల్మెంట్ వ్యవస్థను మరింత పారదర్శకంగా చేపట్టాలి.. రాష్ట్రాలకూ డేటా అందుబాటులో ఉండేలా చూడాలి. చిన్న వ్యాపారస్తులు.. కాంపోజిషన్ జీఎస్టీ చెల్లింపుదారులకు అద్దెల విషయంలో విధించే రివర్స్ ఛార్జ్ మెకానిజం-ఆర్సిఎం నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో భాగంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేసేందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలి. అలాగే బోగస్ రిజిస్ట్రేషన్లను అరికట్టాలన్నారు.

# క్రీడారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

*-శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు*

*-రూరల్ ఎమ్మెల్యే గోరంట్లతో కలిసి కేవీకే పరిశీలన*



రాజమండ్రి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వాలు మారినా క్రీడాప్రాధాన్యతలు మారకూడదనే దృఢ సంకల్పంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు క్రీడారంగాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి స్థానిక నాగులాచెరువులోని క్రీడావికాస కేంద్రాన్ని(స్టేడియం) ఆదివారం ఆయన సందర్శించారు. అసంపూర్తిగా నిలిచి పోయిన క్రీడావికాస కేంద్రాన్ని పరిశీలించి నిర్మాణ పనులపై డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీశారు. నిర్మాణం పనులు నిలిచిపోవడానికి కారణాలు తెలుసుకుని వెంటనే పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలుత రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హయాంలో టీడీపీ పాలనలో రాజమండ్రి నగరం నడిబొడ్డున ఆట స్థలాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ గ్రౌండులో పలు క్రీడలు నిర్వహించేలా సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేసి పునాదులు కూడా వేశారన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు.

**మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంగా తయారుచేస్తాం... : శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు..** నగరం నడిబొడ్డున ఉన్న స్టేడియంలో అసంపూర్తిగా నిలిచిపోయిన క్రీడావికాస కేంద్రం పనులను పునఃప్రారంభించి మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేస్తామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. 2016లో సీఎం చంద్రబాబు క్రీడా వికాస కేంద్రాలకు శంకుస్థాపనలు చేసి 80శాతం వరకూ పనులు పూర్తి చేశారన్నారు. గత వైసీపీ పాలనలో మాత్రం వీటిని పట్టించుకోకుండా వదిలేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తుందని, అసంపూర్తిగా నిలిచిపోయిన క్రీడావికాస కేంద్రాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామని అన్నారు. రాజమండ్రి వేదికగా క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కేవీకేను త్వరితగతిన పూర్తిచేసి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్బాల్ క్రీడలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించామని, ప్రణాళికాబద్ధంగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తున్నామన్నారు. 2027లో అమరావతిలో నేషనల్స్ నిర్వహించే దిశగా సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. దేశంలోనే క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తున్న ఏకైన విద్యాశాఖమంత్రి నారా లోకేష్ అన్నారు. స్కూల్ స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఆ దిశగా స్కూల్ గ్రౌండ్స్ ఏర్పాటుకు జీవోలు జారీ చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా నిలిచిపోయిన కేవీకేలు, మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణాలను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. రాజమండ్రి కేవీకే భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఖేలో ఇండియా ద్వారా నిధులు సమకూర్చి ఏపీ క్రీడారంగాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తామన్నారు. అనంతరం పలువురు కోచ్లు శాప్ ఛైర్మన్ కి వినతిపత్రాలు అందించి క్రీడాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి బురిడీ త్రిమూర్తులు, కోశాధికారి వి.శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి ఎస్.నాగరాజు, ట్రెజరర్ ఎస్.వీరబాబు ఫుట్బాల్ జిల్లా సంఘ కార్యదర్శి ఎస్.గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటి చేత్తో పది పనులు చక్కబెట్టే శక్తి ఒక్క మహిళలకే సాధ్యం



కుప్పం, నేటి పత్రిక ప్రజావార్త : మహిళలు ఎప్పుడూ తమను తాము తక్కువ చేసుకోకూడదు. అవకాశాలు ఇవ్వాలేకానీ ఆడవారు అద్భుతాలు సృష్టిస్తారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 3వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శాంతిపురం, మొరసనపల్లిలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ మగవాళ్లదేముంది ఉద్యోగం చేయడం,ఇంటికొచ్చి భార్య వండింది తిని కూర్చోవడం కదా...అదే వాళ్లు అలా కాదు ..ఒంటి చేత్తో ఏకకాలంలో 10 పనులు చక్కబెట్టగలరు. మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే ఇంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువులు చూసుకుంటున్నారు. మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదు.

**మహిళలను డ్వాక్రాకు ముందు తర్వాతగా చూడాలి...** మహిళలు అన్ని రంగాల్లో మగవారిని మించి విజయాలు సాధించాలని చంద్రబాబు కోరుకుంటూ ఉంటారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించారు. డ్వాక్రా ఏర్పాటుతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. ఒకప్పుడు వందా , రెండు వందల కోసం ఇతరులపై ఆధారపడిన స్త్రీలు నేడు బ్యాంకు లావాదేవీలు స్వయంగా చూసుకునే స్థాయికి చేరారంటే అది చంద్రబాబు తీసుకొచ్చిన డ్వాక్రాతోనే సాధ్యమైంది. చంద్రబాబు ని అక్రమ కేసుతో అన్యాయంగా జైల్లో పెట్టినప్పుడు నా వెంట మహిళా లోకం నడిచింది. రాష్ట్రమంతటా మహిళలు పెద్దఎత్తున బయటకు వచ్చి సంఘీభావం తెలిపారు. నాకు హెరిటేజ్ బాధ్యతలు అప్పగించి పారిశ్రామికవేత్తను చేసింది చంద్రబాబు. నేను ఇవాళ వేలమందికి ఉపాధి కల్పిస్తున్నానంటే అందుకు చంద్రబాబు ప్రోత్సాహమే కారణం.

**కుప్పంలో అభివృద్ధి పరుగులు..** కుప్పం నియోజకవర్గంలో మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు అనేక కంపెనీలు వస్తున్నాయి. శాంతిపురంలో పెద్ద కంపెనీ రాబోతోంది. దాని వల్ల మహిళలకు ఉపాధి లభిస్తుంది. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నాము. మీకు ఎటువంటి సాయం కావాలన్న అడగండి. మహిళలకు చేయి అందించి పైకి తెచ్చేందుకు మేము ఎప్పుడూ సిద్ధంగా ఉంటాము. ఇవాళ నారా బ్రాహ్మణి పుట్టినరోజు సందర్భంగా గ్రామస్థుల సమక్షంలో భువనేశ్వరి కేక్ కట్ చేశారు. చెక్కతో తయారుచేసిన సీఎం చంద్రబాబు, దేవాన్ష్ , భువనేశ్వరి ఫోటో ఫ్రేమ్ ను గ్రామస్థులు బహుకరించారు. బెంగుళూరు టీడీపీ ఫౌండర్ కనకమేడల వీరాంజనేయులు రూ.లక్ష చెల్లించి నారా భువనేశ్వరి చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

## సెంటు భూమి కబ్జా . (మొదటి పేజీ తరువాయి)

దానిపైన ఆయన బొమ్మ వేసుకున్నారు. రాజముద్ర ఉండాల్సిన చోట ఆయన సొంత బొమ్మ వేసుకున్నారు. మనదగ్గర బ్రిటిష్ కాలం నుంచి చాలా పటిష్టంగా రికార్డులు ఉన్నాయి. నిజాం పాలనతో పాటు కొందరు హైదరాబాద్ నుంచి పాకిస్తాన్ వెళ్లిపోవడం వంటి కారణాల వల్ల తెలంగాణలో రికార్డులకు సంబంధించి కొన్ని సమస్యలు ఉంటాయి. కానీ ఆంధ్రప్రదేశ్లో మాత్రం బ్రిటిష్వారు చాలా పకడ్బందీ రికార్డులను నిర్వహించారు. రాళ్లపై ఫోటోలు వేసుకున్నారని. ఆ బొమ్మలు తీయడానికి రూ. 12 కోట్లు అయిందని ముఖ్యమంత్రి వివరించారు. ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్-2024 చట్టం తీసుకొచ్చామని ఎవరైనా వేరేవాళ్ల భూమిని కబ్జాచేస్తే అలాంటి వారిపై చాలా కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా మోసం చేసి భూమిని లాక్కున్నా, బలవంతంగా బెదిరించి లాక్కున్నా కొత్త చట్టం వర్తిస్తుందని, జైల్లో పెట్టే అధికారం ఇచ్చాం. ఎవరైనా ఒకసారి తప్పుచేస్తే పీడీ యాక్టు కింద జైలుకు పంపించే హక్కును చట్టం కింద తీసుకొచ్చాం. ఇక్కడ గ్రామంలో బీసీ కాలనీ.. అతిపెద్ద సమస్య.. 176 ఇంటి జాగాలు.. ఎన్టీఆర్ గారి హయాంలో ఇచ్చాం. ఈరోజు ఈ జాగాలను 22ఏకి ఎక్కించి ఇది మీ భూమి కాదు.. ప్రభుత్వ భూమి అని చెప్పి ఇబ్బందిపెట్టే పరిస్థితికి వచ్చారు. మీ అందరికీ ఒకటే హామీ ఇస్తున్నాం.. మీకు భేషరతుగా పట్టాలు ఇచ్చే బాధ్యత మేము తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 22ఏ జాబితాకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చట్టపరంగా పరిశీలించి చేసి వారిపట్టాలు వారికిచ్చేలా చేస్తాం. ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనేది తన ఆలోచన అని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు.

# ఢిల్లీలో టీడీపీ తొలి సభ్యత్వ డ్రైవ్‌కి అఖండ స్పందన



న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : తెలుగు దేశం పార్టీ (టీడీపీ) ఈరోజు ఢిల్లీలో తన మొట్టమొదటి సభ్యత్వ డ్రైవ్ను విజయవంతంగా నిర్వహించింది, దీనికి మద్దతు దారులు మరియు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మాసోనిక్ సెంటర్ ఆఫ్ ఇండియాలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుండి దేశ రాజధానికి వలస వచ్చిన ప్రజలలో టీడీపీ ప్రభావం పెరుగుతోందని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీలో టీడీపీ నాయకుడు కృష్ణమోహన్ ఆలపాటి హాజరై ప్రసంగించారు మరియు పార్టీ పురోగతి మరియు అభివృద్ధి దార్శనికతను నొక్కి చెప్పారు. తెలుగు టీడీపీ కార్యాలయ కార్యదర్శి ఎన్ సత్యనారాయణ నేతృత్వంలోని దేశం పార్టీ పార్లమెంటరీ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు ఉత్సాహంగా పాల్గొనడాన్ని ఆలపాటి స్వాగతించారు, టీడీపీతో వారి శాశ్వత సంబంధాన్ని మరియు ప్రజలకు సేవ చేయాలనే దాని లక్ష్యాన్ని హైలైట్ చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని ప్రశంసించారు. ఆయన ముందుచూపుతో కూడిన విధానాలు మరియు పాలన లెక్కలేనన్ని మందిని పార్టీ వెనుకకు చేర్చడానికి ప్రేరేపించాయి. ఈ కార్యక్రమంలో గణనీయమైన సంఖ్యలో హాజరైన వారు తమను తాము సభ్యులుగా నమోదు చేసుకున్నారు, ఇది టిడిపి వృద్ధి మరియు శ్రేయస్సును నడిపించే సామర్థ్యంపై వారి నమ్మకాన్ని పునరుద్ఘాటించింది. ఆంధ్రప్రదేశ్ దాటి తన పరిధిని విస్తరించడంతో తెలుగుదేశం పార్టీకి సభ్యత్వ డ్రైవ్ ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తుంది. తమ మద్దతుదారులు ఎక్కడ నివసిస్తున్నారనే దానితో సంబంధం లేకుండా వారితో కనెక్ట్ అవ్వడానికి మరియు తమ దార్శనికతను విశ్వసించే వారిలో ఐక్యతా భావాన్ని పెంపొందించడానికి టిడిపి నిబద్ధతను ఈ సమావేశం ప్రతిబింబిస్తుంది. ఈ చొరవ తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను మరియు భారతదేశం అంతటా తెలుగు మాట్లాడే వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చే సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. పురోగతి మరియు సమగ్రతపై దృష్టి సారించి, టిడిపి ప్రజా-కేంద్రీకృత రాజకీయ శక్తిగా తన పునాదిని బలోపేతం చేస్తూనే ఉంది.

# అల్లు అర్జున్ పై కమలం కటాక్ష వీక్షణాలు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం వివాదాల్లో చిక్కుకుని ఇబ్బందుల పాలు అవుతున్నారు. ఆయన మీద ఏ 11 అంటూ కేసు కట్టి పోలీసులు ఒక రాత్రి జైలుకు పంపించారు. ప్రస్తుతం బెయిల్ మీద ఆయన ఉన్నారు. అంతే కాదు ఏకంగా తెలంగాణా ప్రభుత్వం ఈ కేసు విషయంలో ఎంతటి సీరియస్గా ఉందో అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కూడా స్పష్టం చెబుతోంది. మరో వైపు ఈ కేసు విషయంలో అల్లు అర్జున్ బెయిల్ రద్దు చేయాలని సుప్రీం కోర్టు దాకా తెలంగాణా పోలీసులు వెళ్లారు. ఆయన హీరోగా థియేటర్ కి వెళ్ళి సినిమా చూడడం తప్పు కాదు కానీ హెవీ క్రౌడ్ ఉన్నపుడు వెళ్ళడం తప్పే అని అంటున్న వారూ ఉన్నారు. ఏది ఏమైనా ఈ కేసు విషయంలో ఏ 11 గా ఉన్న అల్లు అర్జున్ని అరెస్ట్ చేయడం మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారూ ఉన్నారు. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా ఉండే విపక్షం ప్రభుత్వానిదే తప్పు అంటోంది. బీఆర్ఎస్ అయితే జనాలను కంట్రోల్ చేయలేకపోయారు అని ప్రభుత్వాన్ని నిందిస్తోంది. ఇక తెలంగాణా బీజేపీ అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా అల్లు అర్జున్ అరెస్ట్ని తప్పు పట్టారు. కేంద్ర బీజేపీ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వంటి వారు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే ఆ ఘటన బాధ్యత అని అల్లు అర్జుని అరెస్ట్ చేయడం తప్పే అన్నారు. ఇక ఏపీలో వైసీపీ అల్లు అర్జున్కి మద్దతుగా నిలిచింది. ఏపీ బీజేపీ కూడా అల్లు అర్జున్ అరెస్ట్ తప్పు అంటోంది. ఈ విషయంలో ఇప్పటికి రెండు సార్లు దగ్గుబాటి పురంధేశ్వరి తెలంగాణా ప్రభుత్వం తీరుని తప్పు పట్టారు. తాజాగా ఆమె మాట్లాడుతూ ఏ 11గా ఉన్న అల్లు అర్జున్ ని అరెస్ట్ చేయడంతో ఉత్సాహం ఏంటని ప్రశ్నించారు. మిగిలిన వారిని అరెస్ట్ చేసి విచారించకుండా ఆయన ఒక్కరినే ఎందుకు అరెస్ట్ చేశారని నిలదీశారు. అది యాధృచ్చికంగా జరిగిన ఘటన తప్ప అందులో హీరో అర్జున్ తప్పు లేదని ఆమె అంటున్నారు. ఒక హీరోగా అల్లు అర్జున్ ఆ థియేటర్ కి వెళ్ళారని చెబుతున్నారు. ఆయన ఏదో కావాలని తొక్కిసలాటకు కారణం అయినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రీకరిస్తోందని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు ఈ విధంగా చూస్తే అల్లు అర్జున్ కి కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ బీజేపీ మద్దతు నిండుగా దక్కుతోంది. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రసంగం తర్వాత ఏ రాజకీయ పార్టీ అల్లు అర్జున్ ని సమర్థించేందుకు ఇప్పటిదాకా ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఏపీ నుంచి చిన్నమ్మ సపోర్ట్ చేయడం పట్ల చర్చ సాగుతోంది. మరో వైపు పుష్ప వన్ టూ ఈ రెండు సినిమాలతో పాన్ ఇండియా స్టార్ గా మారిన అల్లు అర్జున్ విషయంలో బీజేపీ జాతీయ నాయకత్వం కూడా సాఫ్ట్ కార్నర్ తో ఉందని అంటున్నారు. అల్లు అర్జున్ పుష్ప 2 హిందీలో బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దాంతో ఆయన జాతీయ కథానాయకుడిగా ఎస్టాబ్లిష్ అయ్యారు. ఈ నేపథ్యంలో బీజేపీ కరుణ కటాక్ష వీక్షణాలు ఆయన మీద కురిపించడం మీద అయితే రాజకీయంగా కొత్త చర్చకు దారి తీస్తోంది.

# ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా మధుమూర్తి నియామకం

ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్గా మధుమూర్తి నియమితులయ్యారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ప్రొఫెసర్ మధుమూర్తి ప్రస్తుతం వరంగల్ ఎన్ఐటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడిగా ఉన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం జాగర్లమూడికి చెందిన మధుమూర్తి విశాఖపట్నంలో విద్యనభ్యసించారు. ప్రస్తుతం హనుమకొండలో ఉంటున్నారు. ఇక ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజే అప్పటి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. వైస్ ఛైర్మన్ రామమోహన్రావు ఇన్ఛార్జిగా కొనసాగుతున్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక పరిమళాలు..

***- భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించిన రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత***

***- కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు***




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో భవాని దీక్షా విరమణలు రెండో రోజు ఆధ్యాత్మిక పరిమళాల మధ్య ఘనంగా జరుగుతున్నాయి. వేకువజామున మూడు గంటల నుంచే వేలాది మంది భవానీ భక్తులు గిరి ప్రదక్షిణ చేసుకొని అనంతరం అమ్మవారిని దర్శించుకొని, మాల విరమణ చేశారు. ఆదివారం రాష్ట్ర హెూంశాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత మోడల్ గెస్ట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) కార్యకలాపాలను పరిశీలించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమి శాలి తదితరులతో కలిసి కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) నుంచి పర్యవేక్షించారు. సీసీటీవీలు, డ్రోన్ విజువల్స్ ద్వారా నిరీక్షణ పాయింట్లతో పాటు పార్కింగ్, క్యూలైన్లు, ఘాట్లు, దర్శనం, ప్రసాదం కౌంటర్లు, హెూమ గుండాలు, గిరి ప్రదక్షిణ, అన్న ప్రసాదం పంపిణీ పాయింట్ల వద్ద రద్దీని, భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులు ఒకవేళ తప్పిపోతే వారి జాడను వెంటనే తెలుసుకునేందుకు ఈసారి దుర్గమ్మ ఆలయం అందుబాటులోకి తెచ్చిన చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎస్)పై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు రాత్రి 11 గంటలు నాటికి మొత్తం 1,960 మంది చిన్నారులకు క్యూఆర్ కోడ్ ట్యాగ్‌లు వేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు, భక్తుల భద్రతకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసింది. అంతకంతకు భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు క్షేత్రస్థాయి బృందాలను ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా అప్రమత్తం చేస్తున్నారు. అన్ని లైన్లలో ఉచిత దర్శన సౌకర్యాన్ని భక్తులు ఉపయోగించుకుంటున్నారు. అత్యంత ముఖ్యమైన పారిశుధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, ఆలయ ఈవో కేఎస్ రామరావు తదితరులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# రూ.1.26 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి



అద్దంకి,నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి .. ఒకేసారి 111 మంది లబ్దిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం 1 కోటి 26 లక్షల 71 వేల 93 రూపాయల విలువైన చెక్కులతో పాటు ఆరుగురికి ఆపరేషన్ల నిమిత్తం 29 లక్షల 80 వేల విలువైన ఎల్ఓసీలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే .. మరో పక్క హార్ట్, కేన్సర్, కిడ్నీ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. అంతే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ల నిమిత్తం సమయానికి ఎల్ఓసీలు అందజేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నిజమైన మానవీయ ప్రభుత్వమని పేర్కొన్నారు.

# దుబాయ్‌లో వేడుకగా ఎన్టీఆర్ సినీవజ్రోత్సవం



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : యుఏఇ ఎన్.ఆర్.ఐ. టిడిపి ఆధ్వర్యంలో దుబాయ్ వేదికగా డిసెంబర్ 20 నుంచి 22 వరకు 3 రోజుల పాటు క్రిస్మస్ వేడుకలు, ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు మరియు ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టి.డి. జనార్ధన్, తణుకు నియోజక వర్గ శాసన సభ్యులు అరుమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. దుబాయ్‌లోని బిర్యానీమోర్ వేదికగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఇందులో ఎన్టీఆర్ టీడీపీ సభ్యులు, ఐక్య శెట్టి బలిజ సంఘం సభ్యులు, ఐక్య క్రిస్మస్ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన టి.డి. జనార్ధన్ మాట్లాడుతూ... విదేశాలలో ఉంటూ కూడా స్వదేశం పట్ల అభిమానం చూపిస్తున్న ఎన్నారైల మాతృభూమి భక్తి గొప్పదన్నారు. క్రిందటేడాది జరిగిన ఎన్నికలలో నారాచంద్రబాబు నాయుడి విజయం కోసం యుఏఇ నుంచి ఎందరో ఎన్నారైలు ఆంధ్రప్రదేశ్ కొచ్చి నెల రోజులకు పైగా పని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందరి సమష్టి కృషితోనే ఆంధ్రప్రదేశ్ లోమళ్లీ ప్రజాప్రభుత్వం ఏర్పాటయిందని, ప్రజల ఆకాంక్షల మేరకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గారు, ఎన్డీఏ భాగస్వామి పార్టీల అధినేతలు పవన్ కళ్యాణ్,హెూ పురందేశ్వరిలు పని చేస్తున్నారన్నారు. క్రిస్మస్ కేక్ ను కట్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలు సదా ఆచరణీయమని, క్రీస్తు ప్రవచించిన శాంతి, కరుణ, సామరస్యంతోనే మానవాభివృద్ధి సాధ్యం అవుతుందని టి.డి. జనార్ధన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. శాసన సభ్యులు అరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు.

ఇక ఎన్నారై టిడిపీనేతలు నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' వేడుకలలో భాగంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ కార్యక్రమాన్ని జరిపారు. ఆ సందర్భంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ వెలువరించిన 'తారకరామం' పుస్తకాన్ని టి.డి. జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆరాధ్య నటుడు, రాజకీయ నాయకుడైన నందమూరి తారకరామారావు శతజయంతి సంవత్సరాన్ని క్రిందటేడాది ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఘనంగా జరుపుకున్నారని, ఎన్టీఆర్ సినీ ప్రస్థానం మొదలై 75 సంవత్సరాలైన సందర్భంగా ఇప్పుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్ని అన్ని చోట్ల జరుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అంగీకరించిన విషయాన్ని టి.డి. జనార్ధన్ తెలియజేశారు. ఈ వేడుకలలో పశ్చిమగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన టిడిపి యుఎన్ఐ అధ్యక్షుడు మోత్కురు విశ్వేశ్వరరావు, డాక్టర్ రవి, కోడి రాజాకిరణ్, పాడిపిరెడ్డి దాసు, డాక్టర్ ముక్క తులసి కుమార్, ఖాదర్ బాషా, సామ్యూల్ రత్నం, కుడుపూడి సత్య, కేత శెట్టి, జుత్తుగ శ్రీను, కోడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గంటలో తిరుమల శ్రీవారి దర్శనం...



తిరుమల, నేటి పత్రిక ప్రజావార్త : తిరుమలలో భక్తులు గతంలో మాదిరిగా రోజుల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే ఇబ్బంది లేకుండా, గంటలోనే శ్రీవారి దర్శనం కల్పించేలా చేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇటీవలే ప్రకటించారు. ఈ క్రమంలో, గంటలో శ్రీవారి దర్శనం కార్యాచరణకు తొలి అడుగు పడింది. వారం రోజుల పాటు చేపట్టే పైలట్ ప్రాజెక్టుకు నేడు శ్రీకారం చుట్టారు. గంటలోపే దర్శనం విధివిధానాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. మొదట భక్తుల ఆధార్ కార్డు నెంబర్, ఫేస్ రికాగ్నిషన్ తీసుకుని రసీదు ఇస్తారు. స్వామివారి దర్శన సమయాన్ని సూచిస్తూ ఒక టోకెన్ కూడా ఇస్తారు. టోకెన్ లో నిర్దేశించిన సమయానికి భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్దకు చేరుకోవాలి. ఫేస్ రికాగ్నిషన్ స్కానింగ్ అనంతరం వారిని క్యూలైన్ లోకి అనుమతిస్తారు. ఆ విధంగా క్యూలైన్ లోకి ప్రవేశించిన భక్తులు గంటలోపే శ్రీవారిని దర్శించుకుని ఆలయం నుంచి బయటికి వచ్చేస్తారు. ఈ తరహా టోకెన్ల జారీకి టీటీడీ 45 కౌంటర్లు ఏర్పాటు చేయనుంది. సిబ్బందితో పనిలేకుండా ఏఐ టెక్నాలజీని విస్తరించాలని టీటీడీ భావిస్తోంది. నాలుగు విదేశీ సంస్థలు ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ముందుకు రాగా, ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. గంటలోపు దర్శనం పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే... ఈ నెల 24న జరిగే టీటీడీ పాలకమండలి సమావేశంలో ఆమోద ముద్ర వేస్తామని చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు.

# క్రీడ యాప్ ఆవిష్కరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : సీఎం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏ విధమైన చర్యలు తీసుకుంటే ఈ రాష్ట్రంలో రాబోయే కాలంలో క్రీడాకారుల భవిష్యత్తుకు పునాదులు వేసే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఏ రాష్ట్రానికి లేని విధంగా మన ముఖ్యమంత్రి గారి ఆలోచనతో ఎన్నో విషయాలను పొందుపరిచి రాబోయే తరానికి ఒక దిక్సూచిగా ఉండే విధంగా క్రీడా పాలసీ తయారు చేయడం జరిగింది. రాష్ట్రంలో ప్రోత్సాహకాల విషయంలోను, ఉద్యోగ అవకాశాల విషయంలోను వంటి అన్ని అంశాలు క్రీడా విధానంలో ప్రవేశ పెట్టడం జరిగింది. రాష్ట్రంలో జాతీయ స్థాయిలో క్రీడలను ఎలా ప్రోత్సహించాలి, అమరావతి కేంద్రంగా 2027లో ఒక అమరావతి లో జాతీయ క్రీడా పోటీలు జరిపించే విధంగా చర్యలు తీసుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు గారు చెప్తున్నారు. గత ప్రభుత్వంలో హయంలో ఈ రాష్ట్రంలో ఒక క్రీడా శాఖ అనేది లేకుండా పోయింది. ఎన్నో అవమానాలను క్రీడాకారులు, అసోసియేషన్ వారు ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం ద్వారా క్రీడ రంగంలో ఉన్న అందరికీ ఐదు సంవత్సరాలు కన్నీళ్లే మిగిలాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే క్రీడా పాలసీ క్రీడా యాప్ తీసుకొని రావడం జరిగింది. మహెూన్నతమైన వ్యక్తి నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడా శాఖ పరంగా రాబోయే భావితరాలకు మంచి జరుగుతుందని ఉద్దేశంతోనే మేమందరం ముందుకెళ్తున్నాము. విద్య క్రీడా శాఖలు అనుసంధానంతో గ్రామీణ స్థాయిలో ఎలిమెంట్ పాఠశాల విద్యార్థులు మొదలు పై స్థాయిలో నేషనల్ గేమ్స్ ఆడే వాళ్లకు అందరికీ మంచి రోజులు ఉన్నాయి. టెక్నాలజీ పరంగా రాష్ట్రం కొత్త పుంతలు తొక్కుతోంది

# 400 మంది డ్యాన్సర్లు... 1000కి పైగా జనాలు...



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దాదాపు వంద కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న తండేల్ సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న అంచనాలు అన్నీ ఇన్నీ కావు. పైగా కార్తికేయ2 సినిమాకు నేషనల్ అవార్డు రావడంతో చందు మొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా లెవల్లో అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా పోస్టర్లు, గ్లింప్స్ ఆడియెన్స్‌లో ఓ రేంజ్‌లో అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ సారి నాగ చైతన్యకు పాన్ ఇండియా రేంజ్‌లో హిట్టు పడేలానే ఉందని అక్కినేని ఫ్యాన్స్ అందరూ ధీమాగా ఉన్నారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా.. ఈ సినిమా సెకండ్ సింగిల్‌కు సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను మేకర్స్ వెల్లడించారు. ఇప్పటికే రిలీజైన బుజ్జితల్లి సాంగ్ ఒక రేంజ్‌లో ఎక్కేసింది. వింటేజ్ దేవి శ్రీ ప్రసాద్ అంటూ.. శ్రోతలు ఈ పాట గురించి పొగుడ్తూనే ఉన్నారు. ఇప్పటికీ ఏ మ్యూజిక్ ప్లాట్ ఫార్మ్‌లో చూసుకున్న ఈ పాట ట్రెండింగ్‌లోనే ఉంది. అంతలా శ్రోతలకు నచ్చేసింది. ఇక ఇప్పుడు ఈ సినిమా సెకండ్ సింగిల్ కూడా వచ్చేస్తుంది. శ్రీకాకుళంలోని శ్రీముఖలింగం గుడిలో జరిగే జాతర సందర్భంగా ఈ పాట వస్తుందట. శేఖర్ మాస్టర్ ఈ పాటకు ఒక రేంజ్‌లో స్టెప్స్ కంపోజ్ చేశాడట. అంతేకాదు సినిమాలో హైలెట్ అయ్యే వాటిలో ఈ సాంగ్ కూడా ఒకటట. స్క్రీన్‌పై నాగ చైతన్య, సాయిపల్లవి డాన్స్ చూసేందుకు రెండు కళ్ళు సరిపోవని ఇన్ సైడ్ టాక్.

# రామ్ గోపాల్ వర్మకు ఏపీ సర్కార్ షాక్



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఏపీ ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. వైసీపీ హయాంలో 'వ్యూహం' సినిమాకు అక్రమంగా ప్రభుత్వం నుంచి నిధులు పొందారన్న వ్యవహారంపై వర్మకు ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ నోటీసులు పంపింది. ఫైబర్ నెట్ ప్రస్తుత చైర్మన్ జీవీ రెడ్డి ఆదేశాల మేరకు... అప్పటి ఫైబర్ నెట్ ఎండీతో పాటు మరో ఐదుగురికి నోటీసులు జారీ చేశారు. ఫైబర్ నెట్ ద్వారా టెలికాస్ట్ చేసిన 'వ్యూహం' సినిమాకు వ్యూస్ లేకున్నా... ఫైబర్ నెట్ నుంచి రూ. 1.15 కోట్లు చెల్లించారని నోటీసుల్లో పేర్కొన్నారు. నింబంధనలకు విరుద్ధంగా లబ్ధి పొందినందుకు 15 రోజుల్లోగా వడ్డీతో సహా ఆ మొత్తాన్ని చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసులపై వర్మ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.


# హైదరాబాద్ పోలీస్ కమీషనర్ క్షమాపణలు..



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : 'పుష్ప-2' బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ప్రధానంగా శనివారం అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ వ్యాఖ్యానించడం తర్వాత ప్రెస్ మీట్ పెట్టిన అల్లు అర్జున్ పేర్లు ప్రస్థావించకుండా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పడంతో ఒక్కసారిగా విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సినిమాటోగ్రఫీ మంత్రి అల్లు అర్జున్ వ్యవహారశైలిపై కీలక వ్యాఖ్యలు చేస్తూ చట్టం ముందు అంతా సమానమేనని పునరుద్ఘాటించారు. మరోపక్క అసలు సంధ్య థియేటర్ వద్ద ఏమి జరిగిందో తెలుపుతూ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఓ వీడియోను విడుదల చేశారు. అనంతరం ఏసీపీ, చిక్కడపల్లి సీఐ లు చెప్పిన విషయాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సమయంలో సీవీ ఆనంద్ ని మీడియా కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ క్రమంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందని అన్నారు. అయితే తాజాగా సారీ చెప్పారు. అవును.. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి మీడియా సంధించిన ప్రశ్నలకు స్పందించిన చీపీ సీవీ ఆనంద్ ఈ ఘటనకు నేషనల్ మీడియా మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలు అక్కడున్న కొంతమంది జర్నలిస్టులు తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో సీవీ ఆనంద్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ఇందులో భాగంగా ప్రెస్ మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో తాను కాస్త సహనం కోల్పోయానని పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుందని అయితే తాను చేసింది పొరపాటుగా భావిస్తున్నట్లూ చెబుతూ నేషనల్ మీడియాపై తాను చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుంటూ.. క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా డిగిన పలు ప్రశ్నలకు సీపీ సమాధానం ఇచ్చారు. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ వీడియోను విడుదల చేశారు.

# గోదారి గట్టు నుంచి 'ఓజీ'...

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తెలుగు సంగీత ప్రియులకు రమణ గోగుల గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. పవన్ కళ్యాణ్, వెంకటేష్‌తో పాటు ఎంతో మంది టాలీవుడ్ స్టార్ హీరోల సినిమాలకు సంగీతాన్ని అందించడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గర అయ్యారు. ముఖ్యంగా రమణ గోగుల సంగీతాన్ని అందించిన తమ్ముడు, బద్రీ, ప్రేమంటే ఇదేరా, యువరాజ్ ఇలా ఎన్నో సినిమాలకు



తనదైన విభిన్న సంగీతాన్ని ఇచ్చిన రమణ గోగుల మరోసారి తన మార్క్‌ను చూపించేందుకు సిద్ధం అవుతున్నట్లుగా తెలుస్తోంది. సంగీత దర్శకుడిగానే కాకుండా మంచి సింగర్‌గానూ రమణ గోగులకు గుర్తింపు ఉంది. కనుక ఆయనను పట్టుబట్టి మరీ దర్శకుడు అనిల్ రావిపూడి సంక్రాంతికి వస్తున్నాం సినిమా కోసం తీసుకు వచ్చి గోదారి గట్టు పాట పాడించాడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా నుంచి వచ్చిన గోదారి గట్టు పాటకు మంచి స్పందన వచ్చింది. రమణ గోగుల, మధు ప్రియ పాడిన ఆ పాట ఈమధ్య కాలంలో సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు, అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ పాట హిట్ నేపథ్యంలో రమణ గోగుల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ పాట ఇంత హిట్ అయిన నేపథ్యంలో మళ్లీ తాను సింగర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా బిజీ కావాలని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చాడు. త్వరలోనే ఓజీ సినిమా కోసం రమణ గోగుల పాట పాడే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు. పవన్ కళ్యాణ్‌కి రమణ గోగుల అంటే ప్రత్యేకమైన అభిమానం. పవన్ కళ్యాణ్ సినిమాకు పాట పాడేందుకు అవకాశం వస్తే కచ్చితంగా ఎంతటి సింగర్ అయినా వెనక్కి తగ్గేది లేదు. అలాగే ఈ సినిమాలో రమణ గోగుల పాట పాడటం కన్ఫర్మ్ అనే టాక్ వినిపిస్తోంది. అతి త్వరలోనే ఓజీ కోసం రమణ గోగుల పాటను తమన్ రికార్డ్ చేస్తాడనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌తో రమణ గోగులకు మంచి అనుబంధం ఉంది.

# డల్లాస్‌లో రామ్‌చరణ్, సుకుమార్..



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ డల్లాస్ చేరుకున్నారు. వారికి అభిమానుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఇవాళ టెక్సాస్‌లోని గార్లాండ్ లో ఉన్న కర్టిస్ కల్వెల్ సెంటర్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. ఇక ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న థియేటర్లలో విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇందులో చెర్రీ సరసన కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించగా, తమన్ బాణీలు అందించారు. వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఈ మూవీకి కథను అందించారు. ఎస్. జె సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర, అంజలి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# పొరపాటు చేసి సారీ చెప్పిన రష్మిక..




సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చేసిన పొరపాటును తెలుసుకుని తాజాగా సోషల్ మీడియా వేదికగా సారీ చెప్పారు. తాను థియేటర్‌లో చూసిన మొదటి సినిమా తమిళ హీరో విజయ్ నటించిన 'గిల్లీ' అని తెలిపారు. అందుకే విజయ్ దళపతి అంటే తనకు అమితమైన ఇష్టమని ఆమె ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంలో 'గిల్లీ' మూవీ తెలుగు 'పోకిరి' సినిమాకు రీమేక్ అని రష్మిక పొరబడ్డారు. కానీ, ఆ మూవీ 'ఒక్కడు'కి రీమేక్ కావడంతో సరదాగా ఆట పట్టిస్తూ ఆమె ఇంటర్వ్యూ వీడియోను నెటిజన్లు వైరల్ చేస్తున్నారు. దీనిపై తాజాగా రష్మిక 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. అందులోనూ తెలుగులో ఫన్నీగా రాసి పోస్ట్ చేశారు. "అవును.. ఇంటర్వ్యూ అయిపోయాక గుర్తొచ్చింది.. సారీ. గిల్లీ సినిమా ఒక్కడు రీమేక్ అని. పోకిరి మూవీని అదే పేరుతో తమిళంలో రీమేక్ చేశారు. అప్పటికే సోషల్ మీడియాలో నాపై పోస్టులు వైరల్ అయ్యాయి. సారీ.. సారీ.. మైబ్యాడ్. కానీ, నాకు వాళ్లు నటించిన అన్ని సినిమాలు ఇష్టమే" అని ఆమె రాసుకొచ్చారు. ఇక రష్మిక ఇటీవల విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన 'పుష్ప- 2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె ఈ మూవీ విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా రూ. 1500 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. అందులోనూ బాలీవుడ్‌లో 'పుష్ప- 2'కి అడ్డులేకుండా పోయింది. వసూళ్ల పరంగా అక్కడ ఎన్నో రికార్డులను బ్రేక్ చేస్తోంది. కాగా, రష్మిక ప్రస్తుతం 'ఛావా', 'సికిందర్', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'కుబేరా' ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# రేవతి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : పుష్ప-2 ప్రీమియర్స్ సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మనసుతో స్పందించారు. సంధ్య థియేటర్ ఘటనలో చనిపోయిన రేవతి కుటుంబానికి కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ తరఫున రూ. 25 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నా అని నేడు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. పరిహారం ఇస్తామని చెప్పిన అల్లు అర్జున్ మాట నిలబెట్టుకోలేకపోయాడని విమర్శించారు. ఇక, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేంత వరకు అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి బాలుడి ఆరోగ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని అన్నారు.

# జెస్సీరాజ్ ఏపీకి గర్వకారణం: చంద్రబాబు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్ ను ప్రతిష్ఠాత్మక 'ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ - 2025' వరించింది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన 25 మంది చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందిస్తుంది. 14 ఏళ్ల జెస్సీరాజ్ ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి ఎంపికైన జెస్సీరాజ్ ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన స్కేటర్ జెస్సీరాజ్ కు అభినందనలు తెలియజేశారు. ఆమె సాధించిన విజయాలు ఏపీకి గర్వకారణమని చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకోబోతున్నారని తెలిపారు. 9 ఏళ్ల వయసులో ఆమె స్కేటింగ్ రంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించిందని... ఆమె పట్టుదల, అంకితభావం ఆమెను ఈరోజు గొప్ప గౌరవాన్ని అందుకునే స్థాయికి తీసుకొచ్చిందని కొనియాడారు. ఎంతో మంది యువ క్రీడాకారులకు ఆమె ఒక స్ఫూర్తి అని చెప్పారు. ఇటీవల జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్స్ లో సోలో డ్యాన్స్ లో ఆమె సిల్వర్ మెడల్ సాధించారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు రవిచంద్రన్ అశ్విన్ గుడ్ బై



స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై పలికాడు. ఎవరూ ఊహించని రీతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ కు వీడ్కోలు పలికి అందరినీ షాక్ కు గురి చేశాడు. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడో టెస్టు డ్రా అనంతరం రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటన వెలువడింది. 38 ఏళ్ల అశ్విన్ టెస్టు ఫార్మాట్ లో టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ గా ఉన్నాడు. లెజెండరీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో అశ్విన్ ఉన్నాడు. ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్ గావస్కర్ టెస్టు సిరీస్ లో జట్టులో భాగంగా ఉన్నాడు. బోర్డర్ గావస్కర్ టెస్టు సిరీస్ లో ఇప్పటికి మూడు మ్యాచ్ లు పూర్తి కాగా.. అందులో అశ్విన్ ఒక మ్యాచ్ లో మాత్రమే బరిలోకి దిగాడు. రెండో టెస్టులో ఆడిన అశ్విన్ ఒక వికెట్ సాధించాడు. మూడో టెస్టు కోసం అశ్విన్ స్థానంలో జడేజాను జట్టులోకి తీసుకున్నారు. 'భారత క్రికెటర్ గా ఇదే నా ఆఖరి సంవత్సరం' అంటూ బ్రిస్బేన్ టెస్టు అనంతరం రవిచంద్రన్ అశ్విన్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో మాట్లాడాడు. మూడో టెస్టు 5వ రోజు ఆట వర్షంతో నిలిచిపోయిన సమయంలో కోహ్లీతో అశ్విన్ చాలాసేపు మాట్లాడాడు. బహుశా రిటైర్మెంట్ గురించే అయి ఉండాలి.

# తప్పుడు సమాచారంతో మాట్లాడుతుంటే బాధ కలిగింది: అల్లు అరవింద్



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తన కుమారుడు అల్లు అర్జున్ కు ఎదురైన పరిస్థితి పట్ల ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పుష్ప-2 సినిమా భారతీయ సినీ చరిత్రను తిరగరాస్తూ రికార్డులు సృష్టిస్తుంటే, తన కుమారుడు ఆ ఆనందానికి దూరమై, చేయని తప్పుకు కుమిలిపోతున్నాడంటూ ఆవేదన వెలిబుచ్చారు. ఇవాళ అల్లు అర్జున్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి అరవింద్ కూడా హాజరయ్యారు. అల్లు అర్జున్ మాట్లాడిన తర్వాత అల్లు అరవింద్ కూడా మీడియాతో మాట్లాడారు. "ఆలిండియా లెవల్లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రం పుష్ప-2. తన సినిమాను ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటున్నారు, వారి స్పందన ఎలా ఉంది అని స్వయంగా చూసుకునే అదృష్టం అతనికి లేకపోయింది. దురదృష్టకర ఘటనే అందుకు కారణం. ఓ తండ్రిగా నా బిడ్డ వేదన చూడలేకపోతున్నాను. ఇంట్లో గార్డెన్ లో ఓ మూల కూర్చుని దాని గురించే ఆలోచిస్తున్నాడు. దాంతో నేను... ఇలా ఉంటావేంటయ్యా.... వెళ్లి ఫ్రెండ్స్ ను కలువు, లేకపోతే ఊరికి వెళ్లు అని చెప్పాను. ఈ వ్యవహారం నుంచి కొంచెం బ్రేక్ తీసుకో... అస్తమానం దీని గురించే ఎందుకు బాధపడుతుంటావు అని అన్నాను. దేశమంతా నీ సినిమా గురించి మాట్లాడుకుంటున్న సమయంలో నువ్విలా కూర్చోవడం దురదృష్టకరం అని అన్నాను. ఇలా జరగాలని ఉంది... జరిగింది... ఆ విషయాన్ని నేను స్వీకరిస్తున్నాను... తర్వాత వెళతానులే అని బన్నీ బదులిచ్చాడు. ఒక అభిమాని ఫ్యామిలీకి జరిగిన నష్టం పట్ల అతను (అల్లు అర్జున్) బాధపడుతుంటే, అది చూసి ఓ తండ్రిగా నా కడుపు తరుక్కుపోతోంది. అందరూ ఒకటి ఆలోచించాలి... తను 22 ఏళ్లు కష్టపడి ఈ స్థాయికి వచ్చాడు. ఇంతటి పేరు ఒక రోజుతో వచ్చింది కాదు, ఒక సినిమాతో వచ్చింది కాదు, ఒక ప్రెస్ మీట్ తో వచ్చింది కాదు, ఒక సంఘటనతో వచ్చింది కాదు... ఇది తను బిల్డప్ చేసుకున్నాడు. మా కుటుంబంలో మూడు తరాలను మీరు చూశారు. ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నామా? ఎప్పుడైనా ఇంత నిర్లక్ష్యంగా, బాధ్యతా రాహిత్యంతో ఉన్నామా? మేం ఎలాంటి మనుషులం అనేది జనాలకు తెలుసు. ప్రజల కళ్ల నుంచి ఎవరూ తప్పించుకోలేరు. కానీ తప్పుడు సమాచారంతో ఇవాళ ఒకరు మాట్లాడుతుంటే చాలా బాధ కలిగింది. దీనికి వివరణ ఇవ్వాలని అతను (అల్లు అర్జున్) చెప్పగానే... ఏదైనా న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయేమో కనుక్కున్నాం. ఇబ్బంది లేని విధంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశాం. ఇక, ఆ కుటుంబానికి ఏ విధమైన సాయం చేయాలన్నది త్వరలోనే అల్లు అర్జున్, మైత్రీ మూవీస్ వారు చర్చించి నిర్ణయం తీసుకుంటారు" అని అల్లు అరవింద్ వివరించారు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.